01ATP10_01ATP10.qxd 10-02-2023 PM 11:25 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 11 ఫిబ్రవరి 2023 పేజీలు : 04

గెలుపే లక్ష్యంగా పని చేయండి

- అన్ని వర్గాల ఆశాజ్యోతిగా మారిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- చెప్పాడంటే.. చేస్తాడంతే..
- ప్రభుత్వానికి వాలెంటీర్లు, పార్టీకి కన్వీనర్లు, గృహ సారధులే వారధులు
- ఈ నెల 20 నుంచి 27 వరకు ఇంటింటా తిరగాలి
- రాప్తాడు మండల గృహ సారధుల సమావేశంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి , కిట్లను చూపుతున్న దృశ్యం

కార్యక్రమానికి హాజరైన కన్వీనర్లు, గృహ సారధులు

రాప్తాడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పాడంటే.. చేస్తాడంతే.. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఇచ్చిన ప్రతిహామీని ముఖ్యమంత్రి అయిన తర్వాత నెరవేర్చారు. దాదాపు ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. మాట ఇస్తే నెరవేరుస్తాడన్న నమ్మకం ప్రజల్లో ఉంది. మా నమ్మకం నువ్వే జగన్ అని ప్రజలు భావిస్తున్నారు. ఇదే నినాదంతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు ప్రజల్లోకి వెళ్ళామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాప్తాడు మండలంలోని సచివాలయ పార్టీ కన్వీనర్లు, గృహ సారధులతో శుక్రవారం రాప్తాడులో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసిఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని మండి పడ్డారు. కొత్తగా నియమించిన గృహ సారధులు, సచివాలయ కన్వీనర్లతోపాటు నాయకులు, వాలెంటీర్లతో ఈ నెల 20 నుంచి 27 వరకు ఇంటింటా తిరగాలన్నారు. గృహ సారధులకు ప్రత్యేక కిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కిట్లలో గృహ సారధులు ధరించడానికి ప్రత్యేక బ్యాడ్జీలు, ప్రజా మద్దతు పుస్తకాలు, కరపత్రాలు, మొబైల్ స్టిక్కర్లు, డోర్ స్టిక్కర్లు ఉంటాయన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా మద్దతు కోరాలని సూచించారు. గతప్రభుత్వపాలనకు, ఈప్రభుత్వ పాలనకు తేడానుప్రజలకు వివరించాలని తెలియజేశారు.

హామీలు ఇచ్చాడంటే మోసం చేస్తాడంతే.. : గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు అవినీతికి, వివక్షకు పరాకాష్టగా మారాయన్నారు. కేవలం పసుపు కండువా ధరించిన వారికే సంక్షేమ పథకాలు అందాయన్నారు. బడుగు బలహీన వర్గాలను అగౌరవపరిచిన బాబు, వారి సంక్షేమం గురించి ఆలోచించకుండా తన బినామీలకు పెద్ద పీట వేశారన్నారు. బాబు పాలనలో సగటు చిరువ్యాపారికి ఎదిగే అవకాశం లభించలేదన్నారు. తన కార్పోరేట్ స్నేహితులను మాత్రమే ప్రోత్సహించారన్నారు. అలాంటి చంద్రబాబు ఈ రోజు ప్రజల్లోకి వెళ్తే నిన్ను నమ్మం బాబు అని అంటున్నారన్నారు.

చెప్పాడంటే.. చేస్తాడంతే.. : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏది చెప్పినా ఖచ్చితంగా చేసి తీరుతాడని ఎమ్మెల్యే అన్నారు. మాట మీద నిలబడే వ్యక్తిగా ఇప్పటికే జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీని చూడకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని నమ్మే జగనన్న, అన్ని పతకాల ద్వారా కలిగే లబ్దిలో 75శాతం (రూ.2.44 లక్షల కోట్లు) మహిళలకే అందిస్తున్నారన్నారు.

కామెడి మాస్టారు లోకేష్.. : ప్రశాంతంగా అంటే ప్రశాంతి అత్త, పనిముట్లు పందిముట్లు, జిఒ నెంబర్ 1 అంటే జియో నెంబర్ 1 అంటాడు. అందరూ నవ్వుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలకన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉనికి కోసమే జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నాలు

- ఇసుక రీచ్‌లో అక్రమాలు ఉంటే చర్యలు తీసుకుంటాం - తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఉనికి కోసమే..మైలేజ్ కోసమే మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగా పెద్దవడుగూరు ఇసుక రీచ్ వద్ద ఆందోళన చేపట్టారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విమర్శించారు. నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇసుక రీచ్‌లకు అనుమతులు ఉన్నాయో లేదో.. మైనింగ్ అధికారులను కానీ, కలెక్టర్‌ని కానీ అడగాలని, వారు స్పందించకుంటే ఆయా కార్యాలయాల వద్ద ధర్నా చేయాలి కానీ ఇసుక రీచ్ వద్దకు వెళ్లి ఆందోళనలు చేయడం ఏంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. సెన్షేషనల్ కోసమే క్రియేట్ చేశారని, జెసి ప్రభాకర్‌రెడ్డే కాదు ఏ పార్టీ వారు ఇలాంటి ప్రయత్నాలు చేయడం తగదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, మొదటి నుంచి ఆయనకు ఇలాంటివి అలవాటేనని విమర్శించారు. ఇసుకరీచ్‌ల వద్దకు వెళ్లి ఆందోళనలు చేయడం వల్ల కమీషన్ కోసమో.. గుడ్‌విల్ కోసమో.. రాజకీయ లబ్దికోసమో.. ఇతరాత్ర వాటి కోసమో అన్న భవన వ్యక్తం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఆ ఇసుక రీచ్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదని, ఒక వేళ చట్ట వ్యతిరేకంగా ఇసుక రీచ్ నిర్వహకులు వ్యవహరిస్తుంటే తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తాడిపత్రినియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకే పెద్దవడుగూరులో పాదయాత్ర నిర్వహించడం జరిగిందని, ప్రజలు తీసుకొస్తున్న సమస్యలను పరిష్కరించడంతోపాటు గ్రామాలలో ఫ్యాక్షన్‌ను నిర్మూలించడం కూడా పాదయాత్రలో ఒక భాగమన్నారు. తాడిపత్రి ప్రాంతంలో ఫ్యాక్షన్ వల్ల ఎంతో నష్టపోయారని, అనేక మంది ఇబ్బందులు పడ్డారని, నా కుటుంబంకూడా ఫ్యాక్షన్ వల్ల ఇబ్బందిపడిందని, ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదన్న ఉద్దేశ్యంతో పాదయాత్రలో భాగంగా ఫ్యాక్షన్ జోలికి వెళ్ల వద్దని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి గ్రామాలలో ప్రశాంతంగాఉంటే ఓర్చుకోలేక గ్రామాలలో కక్షలు రేపే ప్రయత్నం చేస్తున్నారని ఎక్కడా మంచి వాతావరణం ఉంటే వాటిని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా గ్రామాలలో నీటి సౌలభ్యం లేక, పనులు లేక పోవడం వల్లే రచ్చకట్టల వద్ద కూర్చుని ఇతరాత్ర వాటి గురించి ఆలోచనలు చేస్తుంటారన్నారు. అందుకే సాగునీటిని అందిస్తే పనులు చేసుకుని వారు బాగుపడతారన్న ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో ప్రాజెక్టులకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. సొంత డబ్బులతో కాలువలను బాగు చేయించి చాగల్లు, పెండేకల్లు, రావుల చెరువు, ముచ్చుకోట ప్రాజెక్టులకు నీటిని అందించడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రశాంతతోపాటు అభివృద్ధిని చేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

కర్ణాటక ఎన్నికల్లో

గాలి జనార్ధన్‌రెడ్డి చక్రం తిప్పేనా..?

- బిజెపి సీట్లకు గండి పెట్టేనా..? - బళ్లారి జిల్లాలో ఎన్నికల రసవత్తరం - బళ్లారిలో సోదరునిపైన భార్యను బరిలోకి

పార్టీప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న గాలి జనార్ధన్‌రెడ్డి

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

బళ్లారి గనుల సామ్రాజ్యానికి అధినేతగా ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి కర్ణాటకలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయడం ద్వారా ఆ పార్టీ ప్రభావం ఏ మేరకు ఉంటుంది. ఎవరు విజయావకాశాలు దెబ్బతీస్తుంద అన్నది చర్చనీయాంశంగా మారింది. బళ్లారి జిల్లాలో గట్టి పట్టున్న గాలి జనార్ధన్‌రెడ్డికి తన పార్టీ ద్వారా బలమైన అభ్యర్థులను దింపుతుండటంతో అక్కడ రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి. అక్రమ గనుల కేసులో బెయిల్ మీద ఉన్న గాలి జనార్ధన్‌రెడ్డిని బిజెపి అధిష్టాన వర్గం సరిగా పట్టించుకోలేదనే ఆక్రోశంతో ఉన్నారు. కేసుల నుంచి బయటికి తేలేక పోయిందని అభిప్రాయంతో గాలి జనార్ధన్‌రెడ్డి మదనపడుతు వచ్చారు. కర్ణాటకలో బిజెపి బలోపేతానికి 2008లో కర్ణాటకలో బిజెపి అధికారంలోకి రావడానికి గాలి జనార్ధన్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డారు. బిజెపి కష్ట కాలంలో ఉన్నప్పుడు తన సేవలను పార్టీ వినియోగించుకుని ఆ తర్వాత గాలికి వదిలేశారనే అభిప్రాయంతో కోపం మీద ఉన్న గాలి జనార్ధన్‌రెడ్డి బిజెపి అధిష్టాన వర్గం మాటలు మనస్థాపానికి గురి చేశాయి. గాలి జనార్ధన్‌రెడ్డి మా పార్టీలో లేరని, బిజెపి కీలక నేత కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అమిత్‌షా ప్రకటించడంతోనే కర్ణాటకలో కొత్త పార్టీ ఏర్పాటుకు గాలి జనార్ధన్‌రెడ్డి పూనుకున్నట్లు ఆయన మద్దతు దారులు చెబుతున్నారు. నెలన్నర రోజుల కిందట బెంగుళూరులో విలేకర్ల సమావేశాన్ని గాలి జనార్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసి కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ అని కొత్త పార్టీ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. గాలి జనార్ధన్‌రెడ్డి ప్రకటన కర్ణాటకలో రసవత్తరంగా మారాయి. ముఖ్యంగా బళ్లారి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2008 ప్రాంతంలో బళ్లారి చుట్టుపక్కల జిల్లాలో గాలి జనార్ధన్‌రెడ్డి హవా సాగింది. మైనింగ్ వ్యాపారంలో ఓ స్థాయికి ఎదిగారు. ఆ సమయంలో బళ్లారి జిల్లాలో జరిగిన ఎన్నికల్లో సందూరు అసెంబ్లీ నియోజకవర్గం మినహా అన్ని శాసనసభ స్థానాలు బిజెపి కైవసం చేసుకుంది. అప్పట్లో గాలి జనార్ధన్‌రెడ్డి ఆయన స్నేహితుడు శ్రీరాములు వ్యూహాత్మకంగా వ్యవహరించి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. కర్ణాటకలో 110 స్థానాలు బిజెపి చేజిక్కించుకుని యడ్యూరప్ప అప్పటోల ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పట్లో క్యాంపు రాజకీయాలు నడిపి యడ్యురప్ప సీఎం అయ్యేందుకు గాలి జనార్ధన్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని అప్పట్లో ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో గాలి జనార్ధన్‌రెడ్డి 2011 ప్రాంతంలో సీబిఐ కేసులో అరెస్టు అయి నాలుగున్నర సంవత్సరం జైలు జీవితం గడిపారు. గనుల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సీబిఐ కేసు నమోదు చేసి గాలిని జైలుకు పంపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొన్నేళ్లుగా షరతులతో కూడిన బెయిల్‌పై గాలి జనార్ధన్‌రెడ్డి బయట ఉన్నారు. అనంతపురం-కడప-బళ్లారి జిల్లాల్లోకి వెళ్లరాదని గాలి జనార్ధన్‌రెడ్డికి ఆ కేసులో సుప్రీం కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బళ్లారి జిల్లాలోకి గాలి జనార్ధన్‌రెడ్డి అడుగెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బళ్లారి సిట్టింగ్ ఎమ్మెల్యేగా గాలి జనార్ధన్‌రెడ్డి సోదరుడు గాలి సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు. బిజెపి తరుపున వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తానని సోమశేఖర్‌రెడ్డి విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. కొత్త పార్టీ పెట్టి తన సోదరుడు గాలి జనార్ధన్‌రెడ్డి తప్పు చేశాడన్న అభిప్రాయం కూడా సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బళ్లారి సిటీ నుంచి గాలి సోమశేఖర్‌రెడ్డికి పోటీగా గాలి జనార్ధన్‌రెడ్డి తన భార్య గాలి లక్ష్మి అరుణను కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ తరుపున బరిలో దింపుతానని గాలి జనార్ధన్‌రెడ్డి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. బళ్లారి సిటీలో ఇప్పటికే కాంగ్రెస్, జెడిఎస్, బిజెపి పార్టీలు నువ్వా నేనా అన్న రీతిలో పోటీ పడే అవకాశం ఉన్న నేపథ్యంలో గాలి జనార్ధన్‌రెడ్డి తన సతీమణిని కొత్త పార్టీ తరుపున బరిలో దింపుతుండటం చర్చనీయాంశంగా మారింది. కొప్పల్ జిల్లా గంగావతి నుంచి గాలి జనార్ధన్‌రెడ్డి కళ్యాణ రాష్ట్రప్రగతి పార్టీ తరుపున బరిలో దిగనున్నారు. బళ్లారి జిల్లా సరిహద్దుల్లో ఉన్న గంగావతి నుంచి గాలి జనార్ధన్‌రెడ్డి పోటీ చేస్తుండటంతో ఆప్రభావం బళ్లారి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో కూడా పడనుంది. కర్ణాటకలో 2008లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బళ్లారి జిల్లాలో మెజార్టీ స్థానాలు బిజెపి చేజిక్కించుకోవడానికి గాలి జనార్ధన్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో గతంలో లాగానే మెజార్టీ స్థానాలపై జనార్ధన్‌రెడ్డి ప్రభావం ఉంటుందో లేదోనని చర్చనీయాంశంగా మారింది. తాజా రాజకీయ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ద్వారా కర్ణాటకలో పాదయాత్ర చేసినప్పుడు కాంగ్రెస్‌కు మంచి ఊపువచ్చిందని కాంగ్రెస్ క్యాడర్‌ను చైతన్యపరిచాడని, కర్ణాటక కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కర్ణాటకలోని మెజార్టీ స్థానాల్లో బిజెపి కాంగ్రెస్ నువ్వానేనా అని తలపడే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గాలి జనార్ధన్‌రెడ్డి కొత్తగా ఏర్పాటు చేసిన కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ కర్ణాటకలో ఏమేరకు ప్రభావితం చూపుతుంది. ఓట్ల శాతం ఏ మేరకు మెరుగు పర్చుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

కడప-అనంతపురం-కర్నూలు జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలు, అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా అంతట ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జెసి కేతన్‌గార్గ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. భారతీయ ఎన్నికల సంఘం కడప-అనంతపురం-కర్నూలు జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలు, అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు షెడ్యూల్ గురువారం విడుదల చేసిన నేపథ్యంలో జిల్లా అంతటా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ నెల 16 వ తేదిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందన్నారు. శాసనమండలి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకుగాను 21 మంది నోడల్ అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరందరూ రిటర్నింగ్ అధికారుల హ్యాండ్ బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్దేశిత గడువులోగా వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. నోడల్ అధికారులు చేయాల్సిన పనులపై దిశ నిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ కోసం అధికారులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని, అయితే పట్టభద్రులు, టీచర్లు, స్థానిక సంస్థలలోని ఓటర్లు ప్రేరేపించేలా ప్రవర్తించరాదని ఎన్నికల కమిషన్ పేర్కొందన్నారు. అలాగే ఐటీ ప్లాట్ ఫాంలో నుంచి కూడా ఎలాంటి ఇన్సెంటివ్‌లు వారికి ఇవ్వరాదన్నారు. స్థానిక సంస్థల పరిధిలో కొత్తగా పనులు చేపట్టరాదన్నారు. కొత్త పథకాలు ప్రకటించరాదన్నారు. బహిరంగ ప్రదేశాలలో సమావేశాలకు అనుమతి కోరుతూ ముందు వచ్చే వారికి ముందస్తు పద్ధతిలో అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ.. నోడల్ అధికారులు వారికి అప్పచెప్పిన పనులు తూచా తప్పకుండాపాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ గాయత్రిదేవి, అడిషనల్ ఎస్పీ, కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, ట్రెజరీ శాఖ డిడి సరళ విజయకుమారి, డిఐఓ రవికుమార్; డిఆర్‌డిఏ, మెప్మా, డ్వామా పీడిలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, డిపిఓ ప్రభాకర్‌రావుతదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆసాంతం అవినీతి అక్రమాలకు నిలయం ఆ ఐసిడిఎస్ ప్రాజెక్ట్

- సత్యసాయి జిల్లాలో ఓ ఐసిడిఎస్ ప్రాజెక్టులో అద్దె బిల్లుల చెల్లింపుల్లో గోల్‌మాల్ గోవిందం... - రెండు మండలాల్లో ప్రభుత్వం భవనాలకు అద్దెల చెల్లింపులు - సూపర్‌వైజర్‌లకు, సిడిపిఓలకు మధ్య బెడిసి కొట్టిన అద్దె బిల్లుల వ్యవహారం - బదిలీల పేరిట కక్ష సాదింపు చర్యలకు తెరలేపిన సిడిపిఓ - వెరసి ప్రజాప్రతినిధుల వద్ద పంచాయితీలకు తెరలేపిన వైనం

కదిరి టౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త :

సత్యసాయి జిల్లా పరిధిలోని ఓ ఐసిడిఎస్ ప్రాజక్టు అవినీతి అక్రమాలకు కేంద్ర బిందువుగా మారి ప్రభుత్వ నిధులను యదేశ్చగా దుర్వినియోగం చేసినట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సత్యసాయి జిల్లాలోని ఆ ఐసిడిఎస్ ప్రాజెక్టులో అద్దెబిల్లుల చెల్లింపుల్లో ఓ సిడిపిఓ, ఓ జూనియర్ అసిస్టెంట్ ఆడిందే ఆటగా పాడిందే పాటగా అన్న చందాన నిధులను స్వాహా చేసినట్లు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తిక్కవాని పెళ్లిలో తిన్నవాడే బుద్ధిమంతుడు అన్న నానుడిని సార్థకత చేస్తూ నిధులను గోల్‌మాల్ గోవిందం అన్న రీతిలో తమ ఖాతాల్లో వేసుకున్నట్లు తెలిసింది. ఆ ప్రాజెక్టులోని పరిధిలోని రెండు మండలాల్లో సూపర్‌వైజర్లు, సిడిపిఓ, జూనియర్ అసిస్టెంట్ కుమ్మక్కై ప్రభుత్వ భవనాలు, సొంత భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్ల అద్దె బిల్లులను సుమారు రూ 5 లక్షలకు పైగా స్వాహా చేసినట్లు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ స్వాహా పర్వంలో కొంత మంది సూపర్‌వైజర్‌లు ఎంతో నిజాయితీగా, నిబద్ధతగా, అంకితబావంతో పనిచేసి అంగన్‌వాడీ టీచర్లకు అద్దెబిల్లుల చెల్లింపుల్లో నిజాయితీగా వ్యవహరించినట్లు సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. 2021 అక్టోబర్ నుంచి 2022 డిసెంబర్ వరకూ 14 నెలల సెంటర్ల అద్దెలను అంగన్‌వాడీ టీచర్ల ఖాతాలకు చెల్లించాలని ప్రభుత్వ నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే డిసెంబర్‌లో బిల్లులు పెట్టుకోవాలని సిడిపిఓలు, సూపర్‌వైజర్‌లు అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా వారు తాము అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సెంటర్లకు సంబంధించి బిల్లులను పెట్టుకోగా వారికి 14 నెలలు పాటు బిల్లుల చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాలో జమచేశారు. అయితే ఇంత వరకూ కథ బాగానే నడిచింది కాని రెండు మండలాల్లో మాత్రం ప్రభుత్వ, సొంత భవనాలకు బిల్లులు పెట్టుకోమని వారే చెప్పి వారి ఖాతాల్లో జమచేసి తిరిగి వారి వద్ద నుండి డబ్బులను ముక్కుపిండి ఇటు సిడిపిఓ, అటు సూపర్‌వైజర్లు వసూలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. జరిగిన ఈ అవినతి కుంభకోణం ఈ నోట ఆనోట ప్రాకి భారీ స్థాయిలో సూపర్‌వైజర్‌లకు, సిడిపిఓలకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమన్న చందాన వివాదానికి తెరలేచినట్లు తెలిసింది. ఈ అవినీతి వ్యవహారాని ఇరువురు సూపర్‌వైజర్లు ససేమిరా అని తేల్చి చెప్పడంతో వారిపై బదిలీ వేటుకు రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో బదిలీ చేసిన సూపర్‌వైజర్లుకు అంగన్‌వాడీ టీచర్లు మొత్తం మద్దతుగా నిలిచారు. కాగా 14 నెలల అద్దె బిల్లుల చెల్లింపుల అవినీతి కుంభకోణం వ్యవహారం పీడి వరకూ వెళ్లినట్లు తెలిసింది. సదరు పీడి ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లకు మంజూరు చేసిన అద్దె బిల్లులు వెనక్కి కట్టాలని ఆదేశాలు సైతం జారీ చేసినట్లు తెలిసింది. కాగా ఇంత వ్యవహారానికి తెరలేపిన సిడిపిఓ చావుకబురు చల్లగా చెప్పినట్లుగా పొరపాటున ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లకు బిల్లులు పెట్టామని వాటిని తిరిగి రికవరీ చేసుకుంటామని తాఫీ చెప్పడం కొసమెరుపు.

వైఎస్ఆర్ కళ్యాణమస్తు నగదు జమ

- లబ్దిదారులకు మెగా చెక్కు అందజేసిన సాంఘీక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్‌రెడ్డి

సతీఖిష్-శివలీల

జిలాన్ బాషా-మెహతాజ్

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వైఎస్ఆర్ కళ్యాణమస్తు/షాదీతోఫా లబ్దిదారులకు సాంఘీక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్‌రెడ్డి మెగా చెక్కు అందజేశారు. అక్టోబర్-డిసెంబర్-2022 త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో మొత్తం 309 దంపతులకు రూ.2,48,55,000 నగదు మంజూరైంది. ఈ సందర్భంగా సాంఘీక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలకోసారి కళ్యాణమస్తు-షాదీతోఫా లబ్దిదారులను ఎంపిక చేసి నగదు అందిస్తామన్నారు. నూతన వధువరులు వివాహం అయిన 30 రోజుల్లోపు స్థానిక గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంత డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఏడిసిసి బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టిసి రీజనల్ చైర్‌పర్సన్ మంజుళ, నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, గ్రంథ్రాలయ చైర్‌పర్సన్ ఉమాదేవి, కళ్యాణమస్తు-షాదితోఫా పొందిన లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు తగ్గుతాయి: సతీఖిష్-శివలీల, జిలాన్ బాషా-మెహతాజ్

పెళ్లి అనగానే మాలాంటి పేదలకు ముందుగా గొల్తొచ్చేది ఖర్చు మాత్రమే. ఆ ఖర్చులకు భయపడిమేం కూడా కోవిడ్ పెళ్లి చేసుకుని ఉండాల్సింది అనుకున్నాం. ప్రభుత్వం కళ్యాణమస్తు పథకం అందించి మా మీద ఆర్థిక భారం తగ్గించింది. పదవ తరగతి ఉత్తీర్ణత ఉన్న వారికి మాత్రమే పథకం అందించడం చక్కని నిర్ణయం. ఇలాంటి ప్రోత్సాహకాల వల్ల బాల్య వివాహాలు తగ్గుముఖం పడతాయి. కళ్యాణమస్తు/షాదీతోఫా వివరాలు ఎస్సీ/ఎస్టీలు రూ.1,00,000, ఎస్సీ/ఎస్టీ కులాంతర వివాహం రూ.1,20,000, బిసిలు రూ.50,000, బిసి కులాంత వివాహం రూ.75,000, మైనార్టీలు రూ.1,00,000, వికలాంగులు 1,50,000, గుర్తింపబడిన భవన నిర్మాణ కార్మికులు రూ.40,000.

02ATP27_02ATP27.qxd 10-02-2023 PM 10:54 Page 1

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి
- ఉమా మహేశ్వరనాయుడు

మాట్లాడుతున్న ఉమా మహేశ్వరనాయుడు

కార్యక్రమానికి హాజరైన నేతలు, ప్రజలు

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు పేర్కొన్నారు. 10/02/2023న అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం, శెట్టరు మండల కేంద్రంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులు పూల వర్షంతో ఉమామహేశ్వర నాయుడుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న రచ్చకట్టవద్ద ఉమా మాట్లాడుతూ.. ఈ రోజు ఏ గ్రామంలో చూసినా అభివృది ధూన్యంగామారిందన్నారు. వైసీపీ పాలన అంతా దోపిడి దుర్మార్గం అక్రమాలు దౌర్జన్యాలకే పరిమితమైందని విమర్శించారు. టిడిపి హయాంలో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజలు అభివృద్ధి చెందారని గుర్తు చేశారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టి వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. అందుకోసం నేడు ఏ గ్రామంలో చూసినా చంద్రబాబునాయుడుకు ప్రజలు నిరాజనాలు పలుకుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు సీఎంగా చేయడానికి గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలోగ్రామంలో మహిళలు, యువకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య

రఘు ఫైల్‌ఫోటో , మృతి చెందిన రఘు

కుందుర్పి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని అప్పిలేపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న హరిజన జుబ్బార అంజినప్ప చిన్న కుమారుడు రఘు (28) ఉదయం 11 గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు తాగుడుకు బానిసై గత వారం నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతున్నాడన్నారు. కడుపునొప్పి భరించలేక అప్పిలేపల్లి కొండప్పగారి తోటలోని చింతచెట్టుకు ఉరివేసుకున్నాడన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆ వ్యక్తి మరణించినట్లు నిర్ధారించారు. తరువాత మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యాలు

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : పట్టణంలోని స్థానిక శ్రీ బావి బసవేశ్వరస్వామి ఆలయంలో గురుస్వామి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా గురుస్వామి సోమశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 40 మందికిపైగా రక్తదానం చేశారని, రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. రక్తదానంతో మనం ఇచ్చే వారితోపాటు మనం కూడా ఆరోగ్యంగా ఉంటామన్నారు. రక్తదానం చేసిన శివస్వాములను అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన త్రిప ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గుత్తి టౌన్‌బ్యాంకు శతాబ్దివేడుకలు
- టౌన్‌బ్యాంకు చైర్మన్ అబ్దుల్‌జిలాన్

సమావేశంలో బ్యాంకు చైర్మన్ జిలాన్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : బ్రిటీష్ వలసపాలనలో పెత్తందార్ల చేతుల్లో దోపిడీకి గురవుతున్న ప్రజాసంక్షేమం కోసం 1923లో సహకార సొసైటీగా ఏర్పడి, ప్రస్తుతం వంద కోట్ల పైబడి టర్నోవర్‌తో ప్రవర్ధమానమైన గుత్తి కో ఆపరేటీవ్ టౌన్‌బ్యాంకు సొసైటీ శతాబ్దివేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు అబ్దుల్‌జిలాన్ వెల్లడించారు. స్థానిక బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పట్లో తిరుమలప్ప అనే వ్యక్తి ఏర్పాటు చేసిన సహకార సంఘం 1978లో రెండు బ్రాంచ్‌లుగా ఏర్పడి 2007లో బ్యాంకు ఆర్‌బిఐ గుర్తింపు పొందిందన్నారు. 5366 మంది సభ్యులతో 5 కోట్ల పైబడి మూలధనంతో 95 కోట్ల డిపాజిట్లు, 81 కోట్ల అడ్వాన్స్‌లతో బ్యాంకు వందల కోట్ల టర్నోవర్ సాధిస్తోందని ఆయన అన్నారు. ఆర్‌బిఐ నిబంధనల మేరకు త్వరలో ఎటిఎం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. కోటి రూపాయల వ్యయంతో బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు చేశామని త్వరలో ప్రధాన కార్యాలయాన్ని పట్టణంలో ఏర్పాటు చేస్తామని ఆయన విరించారు. ఆదివారం జరిగే శతాబ్ది ఉత్సవాలకు రాష్ట్ర సహకార మార్కెటింగ్‌శాఖా మంత్రి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హజరుకానున్నారన్నారు. అదేవిధంగా ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మాజీ ఎంపిలు జె.సి దివాకర్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు జితేంద్రగౌడ్, మధుసూదన్‌గుప్తా, ఆంజనేయులు, చుట్టూరు రవీంద్ర, రామయ్యలతో పాటు సహకార బ్యాంకుల ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలియచేశారు. ఈ సమావేశంలో బ్యాంకు పిఇఒ మహేశ్వరప్రసాద్, వైస్‌చైర్మన్ ఎం.కృష్ణ, డైరెక్టర్లు నాగరాజు, రామమోహన్, టి.నాగరాజు, వెంకటేష్, జక్కా వీరన్న, మధుసూదన్, వెంకటేష్‌బాబు, దాదా, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

అబ్బేదొడ్డిలో గడ్డివాము దగ్ధం

మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గుత్తి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో శుక్రవారం వరిగడ్డివాము ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. సమీపంలోని చెత్తకుప్పలను గుర్తుతెలియని వ్యక్తులు అంటించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుసో ్తంది. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మంటలను ఆర్పివేశారు. గడ్డివాము ఎక్కువ శాతం కాలిపోవడంతో 30 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నూతన అన్నదాన భవనం ప్రారంభం

పాజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి, తెలంగాణ మాజీ సిపి సజ్జనార్

లేపాక్షి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : పవిత్ర కేంద్రమైన లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని ప్రారంభించారు. వేదపండితులు సునీల్‌శర్మ నేతృత్వంలో వేదమంత్రోచ్చారణ నడుమ శుక్రవారం ఉదయం గోపూజ, సింహద్వారా మహాలక్ష్మీపూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద భవనం ప్రవేశం జరిగింది. ఇందులో భాగంగా గణపతిహోమము, నవగ్రహ హోమము, దుర్గాహోమము, మహాలక్ష్మీ హోమము, భద్రకాళి సమేత వీరభద్ర స్వామి మూలమంత్ర హోమము, చండీహోమము నిర్వహించారు. ఇందులో భాగంగా దేవిభాగవతంలోని దుర్గాదేవి మహాత్మ్యాన్ని వివరించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఇందులో భాగంగా చండీహోమము కర్తలుగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి, తెలంగాణ ఆర్టీసి ఎండి సజ్జనార్, ప్రముఖ న్యాయవాది శివమూర్తి దంపతులు నిర్వహించారు. అన్నదాన సేవాట్రస్ట్ సభ్యులు రామాంజినేయులు, రాంప్రసాద్, అంజినరెడ్డిలు మాట్లాడుతూ దాదాపు 80 లక్షల రూపాయల వ్యయంతో అన్నదాన భవన నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆలయానికి విచ్చేసిన అప్పటి హైదరాబాద్ సిటి పోలీసు కమీషనర్‌గా పనిచేసిన సజ్జనార్ వీరభద్రాలయానికి విచ్చేసిన సందర్భంలో విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వంటనే నిర్మాణం పనులు చేపట్టాలని దీనికి తనవంతు సహకారం అందిస్తానని ధైర్యం చెప్పడంతో అన్నదాన భవనం నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. నాటి నుండి దాతల సహకారంతో అన్నదాన భవనం నిర్మాణం పనులు ప్రారంభించి ఏడాదిలోపు దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. వీరభద్రాలయానికి వచ్చే పర్యాటకులకు మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయాన్ని కల్పించడమే శ్రీదుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి అన్నప్రసాద సేవా ట్రస్ట్ ప్రధాన ధ్యేయమన్నారు. అన్నదాన భవనానికి ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ట్రస్ట్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్‌పి యశ్వంత్, హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌గని, జెడ్‌పిటిసి శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయ ణస్వామి, గ్రామ సర్పంచు ఆదినారాయణ, చిలమత్తూరు ఎంపిపి పురుషో త్తంరెడ్డి, మాజీ ఎంపిపిలు రామకృష్ణారెడ్డి, ఆనంద్‌కుమార్, మాజీ జెడ్‌పిటి సి ఆదినారాయణరెడ్డి, వైసిపి నాయకులు మధుమతిరెడ్డి,దీపికారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అన్నదాన కమిటీసభ్యులు వెచ్చం రవీంద్రనాథ్, సుబ్రమణ్యం, ఆనందరెడ్డి, హనుమంతు, వీరన్న, పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యవస్థల చేతిలో కేంద్ర ప్రభుత్వం

నిరసన తెలుపుతున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి ప్రత్యేకంగా ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించకుండా రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చూపుతో అన్ని విధాల అన్యాయం చేశారని భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని సిపిఐ మండల కార్యదర్శి శివప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం లేపాక్షిలోని పోస్టాఫీసు కార్యాలయం ముందు పార్టీ ఆదేశాల మేరకు నిరసన తెలిపి పోస్టల్ అధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబానీ, ఆదానీలకు కోట్ల రూపాయలు కొల్లగొట్టి పెడుతున్నారని కానీ పేద ప్రజల ఉపాధి చేసుకుని పనులకు ఎందుకు ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. పోలవరంపై మాటలు చెప్పే కేంద్రం పోలవరం పూర్తయ్యేందుకు ఎందుకు సహకరించలేదని వారు మండిపడ్డారు. ఈ కార్య క్రమంలో సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, మండల సహాయ కార్యదర్శి గౌతమ్‌కుమార్, గోవిందప్ప, వెంకటేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటక పోలీసు కేంద్రాన్ని, పరిశీలించిన జిల్లా ఎస్‌పి

పర్యాటక పోలీసు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

లేపాక్షి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండల కేంద్రమైన లేపాక్షిలో నిర్మాణ దశలో వున్న పర్యాటక పోలీసు కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యాటక పోలీసు కేంద్రంలో నిర్వహించాల్సిన బాధ్యతలను ఎస్‌ఐ మునీర్‌అహ్మద్‌కు సూచించారు. పర్యాటక కేంద్రంలో సుదూర ప్రాంతాలనుండి వచ్చే పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జా గ్రత్తలు చేపట్టాలన్నారు. పర్యాటకులు స్థానికుల నుండి ఎలాంటి సమస్యలు ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. త్వరలోనే పోలీసు కేంద్రాన్ని ప్రారంభిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్‌పి యశ్వంత్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న, వ్యవసాయ అధికారులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలపరిధిలోని దేవగిరి గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను రాయదుర్గం ఏడి లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగం తగ్గించి పశువుల పేడ, కోడి పెంట వినియోగిస్తే దిగుబడి బాగా పెరుగుతుందని, వాటి నుంచి ఎలాంటి ప్రమాదాలు ఉండవని వారు సూచించారు. అంతేకాకుండా ప్రతి రైతు పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి వ్యవసాయంతోపాటు బర్రె, ఆవు, పాడిని కూడా ప్రోత్సహిస్తే ఆరోగ్యానికి సరిపడే స్వచ్ఛమైన పాలు, పెరుగు అందుబాటులోకి వస్తాయని రైతులకు సూచించారు. దానికితోడు పిఎం కిసాన్, ఇకైవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని, అలాగే కౌలు రైతులను ప్రతిరైతుబరోసా కేంద్రానికి 10 మంది రైతులను ఎంపిక చేయవలసిందిగా రైతు భరోసా సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో పొట్టేళ్ల పెంపకం మంచి ఆదాయం వస్తుందని రైతులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల వ్యవసాయ అధికారి బాషా, మండల వ్యవసాయ విస్తరణ అధికారి గోపాల్, రైతు భరోసా సిబ్బంది శ్రీకాంత్, వీరాంజినేయులు, నరసింహులు, భాస్కర్, అవినాష్ రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్నపంటను పరిశీలించిన రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మణ్‌నాయక్

జూదరుల అరెస్ట్

పరిగి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండలంలోని బందార్లపల్లి గ్రామ శివారులో జూదమాడుతున్న వారిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పరిగి ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి జూదమాడుతున్న 7 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 2,600 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎంపిపి
-జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు

జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపిపి

విడపనకల్లు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : మండలంలోని పాల్తూరు గ్రామ పంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఎంపిపి కరణం పుష్పావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారికి సెల్‌ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వైద్యులు సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకుండా ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వైద్యసేవలు కూడా సక్రమంగా అందించడంలేదన్నారు. బాలింతలు, గర్భవతులు సంబంధించిన రికార్డులు లేవని, కాన్పులు కూడా ప్రైవేటు ఆసుపత్రిలో ఎక్కువగా జరుగుతున్నాయన సిబ్బంది పట్ల గ్రామంలోని ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతగా వుండే విధంగా చూడాలని, ప్రజలకు అందుబాటులో వుండి మెరుగైన సేవలు అందించాలని, వీరు ఇదే విధంగా నిర్లక్ష్యంగా వుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసిలు వెంకటేష్, శివ, సర్పంచు రాజశేఖర్, వైకాపా నాయకులు డిష్ వెంకటేష్, షణ్ముఖ, గౌడ్, కావలి వెంకటేష్, హంపయ్య, నాగరాజ్, రాముడు, సుంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య
- మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప

మాట్లాడుతున్న మాజీ ఎంపి నిమ్మల

గోరంట్ల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడం దుర్మార్గపు చర్యని మాజీ ఎంపి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల కిష్టప్ప వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించారు. పట్టణంలోని సిటిసి థియేటర్ ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపడుతున్న తరుణంలో ఓర్వలేని వైసిపి ప్రభుత్వం పాదయాత్రను అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యన్నారు. పాదయా త్రకు వస్తున్న స్పందన చూసి ఓర్వలేక పాదయాత్రను అడ్డుకుంటున్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు మీ మాదిరి ఆలోచించి వుంటే జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసేవారా అన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు తరువాత జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన వారేనని అప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నారా లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు తొలగించి పాదయాత్ర సజావుగా సాగేవిధంగా చూడాలని ఆయన కోరారు. వైసిపి రాక్షస పాలనకు ప్రజలు విసిగిపోయారని వైసిపి నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జవిలి కిష్టప్ప, సుబ్రమణ్యం, నిమ్మల శ్రీధర్, పులేరు మాజీ సర్పంచు నరేష్, వార్డు మెంబర్ నాగరాజు, సింగిరెడ్డిపల్లి సన్న, కక్కల రఘునాథరెడ్డి, మాజీ డీలర్ శ్రీనివాసులు, తిప్పరాజుపల్లి రాజు, మునికుమార్, కన్నా, సోమశేఖర్, సద్దా వెంకటేష్, కమ్మలవాండ్లపల్లి శ్రీనివాసులు, అంజనప్ప, పాల్గొన్నారు.

బెస్ట్ కళాశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం
- ఫీజు ఆలస్యంగా చెల్లించాడని పరీక్ష రాయనివ్వని సిబ్బంది
- సెక్యూరిటీతో బయటకు గెంటించారని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి

గోరంట్ల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : బెస్ట్ యూనివర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో చోటు చేసుకుంది. చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన మనోహర్ (21) తండ్రి లక్ష్మయ్య గోరంట్ల మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద బెస్ట్ ఇన్స్పేషన్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఫీజు గురువారం చెల్లించాల్సి వుండగా ఒక రోజు ఆలస్యంగా చెల్లించాడనే కారణంతో శుక్రవారం జరుగుతున్న పరీక్షను రాయనివ్వకుండా అడ్డుకుని సెక్యూరిటీతో బయటకు గెంటించారని అలాగే ఒక సంవత్సరం వృధా అవుతుందని మనస్థాపానికి గురై పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో వెంటనే తోటి స్నేహితులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థి బంధువులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి ఫోన్ చేయించినా కనీసం ఫోన్లో మాట్లాడకుండా ఎమ్మెల్యేతో ఫోన్ చేయిస్తావా అంటూ విద్యార్థితో సిబ్బంది మాట్లాడి బయటకు గెంటించడం జరిగిందని బాధిత విద్యార్థి కన్నీళ్ల పర్యంతమయ్యాడు. అలాగే ఆలస్యమైందని ఫీజుకు అదనంగా మరో 5 వేలు కూడా చెల్లించానని అయినా తనను రెకమెండ్ చేయిస్తావా అంటూ తనను మందలించారని వాపోయాడు. కళాశాలలో విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమను ఫీజుల పేరుతో వేధిస్తున్నట్లు ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు కూడా ఏమి పట్టించుకోకపోవడంతో యూనివర్సిటీ సిబ్బంది నిర్లక్ష్యానికి అడ్డు అదుపు లేకుండా పోతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

అండగా ఉంటా..అధైర్య పడవద్దు - వడ్డె వెంకట్

శ్రీసత్యసాయి జిల్లా (వైద్యం), ఫిబ్రవరి 10, ప్రభాతవార్త

మండల కేంద్రమైన కొత్తచెరువుకు చెందిన వడ్డె శ్రీరాములు గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో తెదేపా వడ్డెర సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కొత్తచెరువులోని వడ్డెర కాలనీలో నివాసముంటున్న శ్రీరాములు నివాసానికి వెళ్ళిన వెడ్డ వెంకట్ బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ వడ్డెరలకు అన్నివిధాల అండగా నిలస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక వడ్డెర సంఘం నాయకులు వడ్డె వెంకట్‌ను అభినందించారు. ఈ కార్యాక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వడ్డె పెద్దన్న, వెంకటాపురం రాజా, కొల్లకుంట నాగరాజు, పూజారి పెద్దన్న, విజయ్, వెంకటరాముడు, ఫణి, డీలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువతి మృతి

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 10, ప్రభాతవార్త : పట్టణంలోని కోటవీధికి చెందిన జ్యోతి(27) అనే అవివాహిత యువతి కడుపునొప్పి తాళలేక మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం కడుపునొప్పి రావడంతో తల్లిశివమ్మతో పాటు బంధువులు ధర్మవరం ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. తరచూ ఆమెకు కడుపునొప్పి వచ్చేదని, యువతి 10వ తరగతి వరకు చదువుకొందని, ఆమెతండ్రి మూడేళ్ళక్రితమే అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలియజేశారు. తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు.

శ్రీ జములమ్మదేవి, గద్దిరాల మారెమ్మదేవి విగ్రహాల ప్రతిష్ట

నూతన ఆలయంలో హోమమును వైధికంగా నిర్వహిస్తున్న దృశ్యం.

శ్రీ జములమ్మదేవి, గద్దిరాల మారెమ్మదేవి విగ్రహాల ప్రతిష్ట.

గుంతకల్లు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : పట్టణంలోని అంకాలమ్మ వీధి - హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో నూతనంగా దేవాలయం నిర్మితమైన తీరులో ఆలయంలో శ్రీ జములమ్మదేవి, గద్దిరాల మారెమ్మదేవిల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగాను, వైధికంగా పూజలు జరిగాయి. శనివారం ఆలయంలో ఆర్.కుళ్లాయప్ప,ఇందిరాదేవి దంపతులు తమ భక్తిని చాటుతూ ప్రత్యేకంగా హోమమును నిర్వహి ంచారు. తదుపరి వారు ఆలయంలో అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాల నిర్వహణతో పాటు దాదాపు 2,500మంది మహిళా ఆడపడుచులకు నూతన వస్త్రములతో వడిబియ్యం కార్యక్రమంను శాస్త్రోక్తంగా వారు చేపట్టారు.

వైధికంగా శ్రీ వకుళమాతదేవి, కుబేరస్వాముల విగ్రహ ప్రతిష్ట...
శ్రీ మలయప్ప సమేత గోదాదేవి, పద్మావతి మూలవరులకు విశేష అభిషేకాల పూజలు...

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వకులాదేవిమాత, కుబేరస్వాముల విగ్రహ ప్రతిష్టల పూజల దృశ్యం.

గుంతకల్లు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త : పట్టణంలోని రాజేంద్రనగర్ ప్రాంతంలో నిర్మితమైన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో నూతనంగా కలియుగవైకుంఠ శ్రీనివాసుని తల్లి శ్రీ వకుళాదేవిమాత, కుబేరస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం వైధికంగా నిర్వహించారు. శనివారం దేవస్థానంలో 22వ యేటకు అడుగిడుతున్న శ్రీవార్ల మూలవరుల విగ్రహ ప్రతిష్టలు జరిగిన సందర్భంను పురస్కరించుకుని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల బృందం పర్యవేక్షణలో శ్రీ వారి ఆల

కార్పోరేట్ విద్యా సంస్థలు బంద్ విజయవంతం

- నారాయణ కళాశాలను వెంటనే సీజ్ చేయాలి - నారాయణ కళాశాలకి వత్తాసుగా పని చేస్తున్న ఆర్ఐఓని సస్పెండ్ చేయాలి - ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏపీఎస్ఎఫ్, బిఎస్సీఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైఖ్య నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

కార్పోరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని గత కొన్ని రోజుల క్రితం నారాయణ కళాశాల జరిగిన ఘటనకు నారాయణ కళాశాలను సీజ్ చేయాలని శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏపీఎస్ఎఫ్, బిఎస్సీఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైఖ్య నాయకులు కార్పోరేట్ విద్యా సంస్థల బంద్ చేయడం జరిగింది. విద్యా సంస్థలు బంద్ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కుళ్లాయి స్వామి, చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏపీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్య దర్శి ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో కార్పోరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడి ఒక మాఫియా రూపంలో జరనుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేర్లతో విద్యా సంస్థల యాజమాన్యులు వేధిసున్నారన్నారు. గత కొన్ని రోజుల క్రితం భవ్యశ్రీ అనే విద్యార్థి యాజ మాన్యం ఒత్తిడి వల్ల ఇలా చేసుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, ఉమా మహేష్, వంశీ, ఆనంద్, పవన్, మారుతి, కిరణ్ చంద్ర, రాజేష్, సురేష్, శివ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అదానీ ఆస్తులను జప్తు చేసి దేశ ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించాలి

- ఆర్థిక నేరగాడు అదానికి దాసోహమంతటున్న ప్రధాని మోదీ, సీఎం జగన్ - జిల్లాలో అదానికి కట్టబెట్టిన భూములు వెనక్కు తీసుకోవాలి - సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

దేశ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిన ఆర్థిక నేరగాడైన అదానీ ఆస్తులను జప్తు చేసి జాతికి అంకితం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నగర కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల క్రితం దేశ ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన సమయంలో 8 బిలియన్ల డాక్లర్ల ఆస్తి ఉన్న గుజరాత్ వాసి అదానీ నేడు 148 బిలియన్‌డాలర్లకు అధిపతి అయ్యాడని విచారం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడం జరిగిందన్నారు. మోడీ బినామీలకు కుప్పలు తిప్పలుగా బ్యాంకుల ద్వారా సాయం అందిస్తున్న మోదీ బినామీ అయిన అదానికి ఒక్క రోజు ఆదాయం వచ్చేసి 16 60 కోట్లు ఆదాయం రావడం జరిగిందన్నారు. అలాగే 30పైన కంపె నీలు షేర్లు పెట్టి కొనడం జరిగిందన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమణ, రాజేష్‌గౌడ్, నాగరాజు, నగర సహాయ కార్యదర్శి అల్లిపీరా, నాయకులు బంగారు బాషా, రామాంజినేయులు, సుందర్‌రాజు, వరలక్ష్మి, ప్రసాద్ గౌడ్, ఈశ్వరయ్య, నాగప్ప, గాదిలింగ, మున్నా, సూరి, రాజు తదిత రులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి

- విద్యార్థుల ఆత్మహత్య ప్రయత్నాలను అరికట్టండి - అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ దగ్గర నిరాహార దీక్ష - అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం దగ్గర అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని అనుమతి లేని కోర్సుల పేరుతో వేలాది లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని నిరాహార తీక్ష చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫాపిరెడ్డిపల్లి పృథ్వి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రాణా లతో చెలగాట మాడుతున్న నారాయణ కళాశాలను సీజ్ చేయాలని అదే విధంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అనుమతి లేని కోర్సులు నడుపుతూ విద్యార్థి తల్లిదం డ్రులు మధ్య పెట్టి వేలాది లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్య ంలో నిర్వహించిన నిరాహార దీక్షలో పాల్గొన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కార్యదర్శి ధర్మవరం, విష్ణు, నాయకులు రామగిరి మారుతి, శంకర్, విజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మోసపు దుల్హాన్ పథకం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మైనార్టీ వధువరులను మోసం చేసేందుకు అనేక రకమైన ఆంక్షలతో ఈ పథకాన్ని మూడున్నరేల్ల తరువాత ప్రవేశ పెట్టారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్ ఆరోపించారు. పేదింటి ఆడపిల్లల పెళ్లి కుటుంబానికి భారం కాకుండా ఉండేలా ఆర్థిక సాయం అందించేలా పెళ్లకానుకల పథకానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. 2015 ఏప్రిల్ 29న జీవో నెం.67 జారీ చేసి దుల్హాన్ పేరుతో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వధువులకు రూ.50వేలు సింగిల్ డెస్క్ విధానంలో పెళ్లి మండపంలో అందించారన్నారు. టీడీపీ హయాంలో రూ. 163. 61 కోట్లతో 32,722 మంది మైనార్టీ వధువులకు సాయం అందించారన్నారు. అధికారంలోకి వచ్చాక పెళ్లి కానుక మొత్తాన్ని రూ.లక్షకు పెంచుతూ, పథకం పేరును వైఎస్ఆర్ పెళ్లి కానుకగా మార్చుతూ 19/9/ 2019న జీవో నెంబర్ 105 జారీ చేశార న్నారు. 2/04/2020 నుంచి అమల్లోకి వస్తుందని, పెంచిన కానుక మొత్తం అందించడం జరుగుతుందన్నారు. కానీ నేటికీ అతిగతి లేదన్నారు. 11/11/2020 విజయవాడలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్ని కూడా పరిష్కరించనున్నట్లు జగన్‌రెడ్డి ప్రకటించారన్నారు. ఇ ంత వరకు ఒక్క దరఖాస్తు కూడా పరిష్కరించలేదన్నారు. 2021 జనవరిలో పథకం ద్వారా లబ్ది పొందేందుకు ఉండాల్సిన అర్హత లను కూడా నిర్ధారించార న్నారు. కుటుంబ సర్వే, వధువు, వరుడు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితులై ఉండాలన్నారు. ఇద్దరూ తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉండాలి, పెళ్లి రాష్ట్రంలో నే జరగాలి అంటూ నిబంధనలు రూపొం దించారన్నారు. పెళ్లి కానుకను మూ డు న్నరేళ్ల పాటు కనీసం పట్టించుకోక పోవడంతో మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ నేత షిబ్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా (23/ 06/2022) పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవని అందువల్ల ఆపి వేసినట్లు కోర్టుకు వివరించారన్నారు. ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ యు వతులకు పెళ్లి సమయంలో అండగా నిలిచే దుల్హాన్ పథకాన్ని ఎందుకు నిలిపివేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దుల్హాన్ పథకం నిలిపివేయడం ముమ్మాటికీ ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ వర్గాలను వంచించడమే ఈ కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అందరికీ అందుబాటులో వైద్య సేవలు

- సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి

కేక్ కట్ చేస్తున్న బొమ్మనశ్రీరామిరెడ్డి

బొమ్మన శ్రీరామిరెడ్డిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మో హన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సామాన్యులందరికీ ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసు కొచ్చారని, సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీ రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో సూపరింటెండెంట్ రమణ నాయక్ మూడు నెలల్లో 108 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు. గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఇతర మండలాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లి వ్యయ ప్రయాసాలు పడేవారని, నేడు మండల కేంద్రంలోని ఆసుపత్రిలో చక్కటి వైద్య సేవలు అందిస్తున్నారని, ప్రజలం దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ మెంబర్ డా.శివ శంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఆలీ బాషా, ఆ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అదాని ఆస్తులు జప్తు చేయాలి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున

నిరసన తెలియజేస్తున్న సిపిఐ నాయకులు

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

భారతకమ్యునిస్టు పార్టీ సిపిఐ మండల కేంద్రంలోని శుక్రవారం తహశీలారు కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ అదాని ఆర్థిక అవకతవకలకు వ్యతిరేకంగా మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపిఐ చిరుతల మల్లికార్జున హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడం జరిగిందన్నారు. మోడీ బినామీలకు కుప్పలు తిప్పలుగా బ్యాంకుల ద్వారా సాయం అందిస్తున్న మోదీ బినామీ అయిన అదానికి ఒక్క రోజు ఆదాయం వచ్చేసి 1660 కోట్లు ఆదాయం రావడం జరిగిందన్నారు. అలాగే 30పైన కంపెనీలు షేర్లు పెట్టి కొనడం జరిగిందన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ క్యాదర్శి పి.రామకృష్ణ, రూరల్ మండల కార్యదర్శి ఎం.రమేష్, మండల సహాయ కార్యదర్శి నరేష్, చలపతి, రైతు సంఘం నాయకులు వెంకటనారాయణప్ప, నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, సిపిఐ నాయకులు ఎస్.బాషా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం ప్రకటించాలి

- యుటిఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఉద్యోగులకు ఒకటిన్నర సంవత్సరాలుగా చెల్లించవలసిన పిఎఫ్, ఏపిజిఎల్ఎస్ఐ, డిఏలు, సరండర్ లీవులు సహా అనేక ఆరియర్లు సుమారు 3వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిందని, వాటిని కనీసం కొంతమే రకైనా చెల్లింపు చేయకపోగా వేతనాలు సైతం ఒకటవ తేదికి చెల్లించలేని పరిస్థితి నెలకొందని, కాబట్టి ఆర్థిక పరిస్థితులపై ప్రభుత్వ శ్వేతపత్రం ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్దయర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. నెలలో 10వ తేది వచ్చినా ఇప్పటి వరకు కేవలం 30 శాతం మందికి మాత్రమే వేత నాలు అందాయని, ఇంకా 70 శాతం మందికి వేతనాలు చెల్లింపు జరగలేదన్నారు. అలాగే ఉద్యోగులకు చెల్లించవలసిన పిఎఫ్, ఏపిజిఎల్ ఎస్ఐ, డిఏ తదితర బకాయిలు జనవరి 15 నాటికి కొంతమేర చెల్లిస్తామని డిసెంబర్‌లో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆర్థిక శాఖ అధికారులు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్య క్షులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కార్యదర్శి ప్రమీళ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు దేవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు వ్రాయుటకు పరీక్ష ఫీజు చెల్లించిన జనరల్, ఒకేషనల్ (గ్రూపులకు సంబంధించిన మొదటి సంవత్సరం విద్యార్థులు అందరూ (రెగ్యుర్, ప్రైవేట్), ఇంటర్ చదివి నైతికత, మానవతా విలువలు/ పర్యావరణ విద్య పరీక్షలో ఫెయిల్ అయిన లేదా హాజరు కాని విద్యార్థులు కూడా ఈ నెల 15వ తేది బుధవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూ (నైతికత, మానవతా విలువలు), 17వ తేది శుక్రవారం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్ష తప్పనిసరిగా హాజరు కావాలని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, ఇంటర్మీడియెట్ విద్యా మండలి అధికారి డా.సి.సురేష్‌బాబు ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి 25721 మంది జనరల్ విద్యార్థులు, 2292 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరగుతున్నారన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం

- జనసేన మండల కన్వీనర్ తోట ఓబులేసు

శింగనమల, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం మూడవ విడత చేపడు తున్నట్లు జనసేన పార్టీ మండల కన్వీనర్ తోట ఓబు లేసు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేది నుంచి 28వ తేది వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగు తుందని, పార్టీ సభ్యత్వం కావాల్సిన వారు ఆధార్‌కార్డు, పాస్‌పో ర్ట్ ఫోటో సైజ్‌ఫోటో, నామిని ఆధార్‌కార్డు, 500 నగదు, పర్మినెంట్ ఫోన్ నెంబర్ తీసుకుని రావాలన్నారు. కార్యకర్తలకు ఏమైనా సందేహాలు ఉంటే 99635879 83కి నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

తోట ఓబులేసు

13న స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లాలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రకటన దృష్ట్యా మార్చి నెలలో జరగబోయే ఎన్నికల కారణంగా ప్రభుత్వ అధికారులు ఎన్నికల విధులలో నిమగ్నం అయినందున 13 తేది సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగు స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయబడిందని కావున జిల్లా ప్రజలు ఈ విషయంను గమనించాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

పివికెకె ఐటి డిప్లమో కళాశాలలో ఘనంగా ముగిసిన స్వాధ్యాయ-2023

అనంతపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త బ్యూరో

నగరంలోని స్థానిక రుద్రంపేట వద్దగల పివికెకె ఐటి డిప్లమో కళాశాలలో స్వాధ్యాయ-2023 పేరిట మూడు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో విద్యార్థులు చేసినటువంటి వివిధ రకాల నమూనాలను ప్రదర్శనలో ఉంచడం జరిగింది. వీటిని చూడటానికి వచ్చినటువంటి వివిధ కాలేజీ, పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు వాటిని వీక్షిం చి, వాటి యొక్క పనితనాన్ని తెలుసుకుని, ఇలాంటి ప్రదర్శనలు తిలకించడం ద్వారా భవిష్యత్తులో మాకు ఎంతో ఉపయోగపడుతాయని వారి యొక్క సం తోషాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తేజ కోచింగ్ సెంటర్ అధినేత తేజేశ్వర్‌రెడ్డి విచ్చేసి నమూనాలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఇందులో అత్యుత్తమమైన మూడు నమూనాలను బిడ్జ్ కన్స్ట్రక్షన్ లైవ్ ప్రాజెక్టు, ఎలక్ట్రికల్ పవర్ జనరేషన్‌ప్రమ్ ప్లాస్టిక్, టు ఇన్ వన్ ల్యాడర్ నమూ నాలను తయారు చేసి విద్యార్థిని, విద్యార్థులకు శ్రీ బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డా.పల్లె వెంకట కృష్ణ కిషోర్ బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఆయన ప్రసంగిస్తూ విద్యా ర్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను మెరుగు పరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలియజేశా రు. కళాశాల ప్రిన్సిపాల్ జియన్‌యస్ వైభవ్ మాట్లాడుతూ. స్వాధ్యాయ కార్యక్రమాన్ని గత 5 సంవత్సరాలుగా ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల ఫ్లాష్ మోబ్ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సైబర్ అలర్ట్.. అనంతపురం జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మీ బ్యాంకు ఖాతా స్తంభిస్తుంది అలా స్థంభించకుండా ఉండాలంటే మేము అడిగిన వివరాలను చెప్పండి అంటూ ఎవరైనా మీకు ఫోన్ చేస్తున్నా రా. .? అలాంటి వారి మాటలను నమ్మి మీ బ్యాంకు ఖాతా వివరాలను వారికి తెలియజేస్తే సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడే అవకాశం ఉంది జాగ్రత్త అంటూ జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి ప్రజలను ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు మేము బ్యాంకు హెడ్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం మీ యొక్క బ్యాంకు ఖాతా త్వరలో స్తంభిస్తుంది. అలా జరగకుండా ఉండాలంటే మేము మీకు ఇప్పుడు అడిగే కొన్ని వివరాలను తెలియజేయండంటూ మొదటగా మీ యొక్క పేరు, బ్యాంకు ఖాతా నెంబర్‌ణు చెబుతారు. మీరు ఆ వివరాలను విని నిజంగా బ్యాంక్ వారే ఫోన్ చేశారు అనుకుంటారు. ఆ తర్వాత ఓటిపిలు అడిగి మోసం చేస్తారన్నారు. అలా ఎవరైనా మోసపోతే వెంటనే సైబర్ క్రైంలోకానీ 1930 కు గాని ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

ఘనంగా వీడ్కోలు సమావేశం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

శ్రీ మేధా జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు కళ్యాణదుర్గం రోడ్డులోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాల ఆవరణంలో వీడ్కోలు సమావేశం ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి జరప్రియకవి ఏలూరు ఎంగన్న, దిశా డిఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏలూరు ఎంగన్న మాట్లాడుతూ.. మన పౌరాణిక నాయకులైన రాముడు, కృష్ణుడు, అర్జుణులు, హనుమంతుడు మొదలైన వాళ్లను ఆదర్శంగా తీసుకొని విద్యను ఆర్జించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, శ్రీవాసవి కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. దామోదరరెడ్డి, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డిఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

శ్రీశైలంకు శివ భక్తులు పాదయాత్ర

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలంలోని శివమాల దరించిన శివ భక్తులు రూరల్ మండలం నుంచి శ్రీశైలం వరకు గుజ్జల ఈశ్వరయ్య అధ్వర్యంలో శివ భక్తులు పాదయాత్రగా బయలుదేరిన శుక్రవారం వెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివరాత్రి పండుగ సమయానికి శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంకు ఈ పాదయాత్ర చేరుకుని శివరాత్రి రోజున స్వామివారిని దర్శించుకుని తిరిగిరావడం జరుగుతుందన్నారు.అదే విధంగా శ్రీభ్రమరాం బికదేవి, మల్లికార్జునస్వామి ఆశీస్సులతో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మళ్ల మంచి మెజార్టీతో గెలిచి మంత్రి పదవిని చేపట్టాలని ఆ దేవుని ప్రార్థించడం జరిగిందన్నారు.

శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరిన శివభక్తులు.

ఉత్సాహంగా క్రీడా దినోత్సవం

క్రీడా దినోత్సవంలోని దృశ్యాలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

దిట్రెల్లిస్ పాఠశాల వార్షిక క్రీడోత్సవాన్ని శుక్రవారం నగరంలో జీసస్ నగర్‌లోని ట్రెల్లిస్ పాఠశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. క్రీడా దినోత్సవంలో అన్ని తరగతులకు చెందిన 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. థ్రిల్స్, అరుపులు, చప్పట్ల మధ్య ఉత్సాహంతో, ఆనందంతో నిండిన రోజుగా మారింది. ట్రెల్లిస్ స్కూల్ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీకాంత్ వడ్ల, అధ్యక్షుడు వెంకట సిరిదీప్, కోశాధికారి నందిని బేడిగర్ ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీకాంత్ వడ్ల తన ప్రసంగంలో క్షేత్ర ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన శక్తి, ఉత్సాహాన్ని ప్రశంసించారు. అధ్యక్షులు వెంకట సిరిదీప్ తన ప్రసంగంలో క్రీడా దినోత్సవం అనేది జీవిత పోటీకి విద్యార్థులను సిద్ధం చేయడానికి అభ్యాస అనుభవంపై చేయి అని పేర్కొన్నారు. చివర్లో వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

ఫోక్సో కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష రూ.600 జరిమానా విధింపు

- ఈ మేరకు అనంతపురంఫోక్సో కేసుల స్పెషల్ తీర్పు వెలువరింపు - దర్యాప్తు అధికారి, ఏపిపి కోర్టు కానిస్టేబుళ్లను అభినందించిన జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

.తాడిపత్రి పట్టణంలో ఏడాదిన్నర కిందట జరిగిన ఫోక్సో కేసులో ఒకరికి 2 సంవత్సరాల జైలు శిక్ష రూ.600 జరిమానా విధిస్తూ అనంతపురం ఫోక్సో కేసుల స్పెషల్ కోర్టు జడ్జి టి.రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. ఈ ఘటనపై తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో 20/07/2021 తేదిన క్రైమ్ నెంబర్ 520/2021, యు/ఎస్ 354 (డి), 452, 506 ఐపిఎస్ సెక్షన్ 11 అండ్ 12 ఫోక్సో యాక్ట్ 2012 కేసు నమోదు చేశారు. ఎస్సై ధరణిబాబు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును సక్రమంగా విచారించిన జడ్జి నింధితుడి తుకారాం నారాయణస్వామికి 2 సంవత్సరాల జైలు శిక్ష రూ.600 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారిని, ప్రాసిక్యూషన్ తరుపున వాదించిన ఏపిపి విద్యా పతిలను, కోర్టు కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి అభినందించారు.

నేడు సెలవు లేదు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

2023 పొంగల్ హాలిడేలో ఒ

04ATP10_04ATP10.qxd 10-02-2023 PM 11:24 Page 1

ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన - ఆకస్మిక తనిఖీలు

అగళి, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కెజిబివి పాఠశాలకు వెళ్లి ఎస్ఓ నాగరత్నతో సిబ్బంది పనితీరును అడిగి తెలుసు కోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. నాడు-నేడు పనులను ఎలా జరుగుతున్నాయన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఆదర్శ పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించడంతోపాటు మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే లాంటి జాతీయ పండుగలకు ప్రోటోకాల్ పాటించి నాయకులను ఆహ్వానిస్తామని ప్రిన్సిపాల్ చక్రధర్ తెలిపారు. ఆదర్శ పాఠశాల పరిశీలన అనంతరం అగళి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎవరెవరు విధులకు హాజర య్యారన్న విషయాన్ని ఆరాతీశారు. కాన్పులను ఆసుపత్రుల్లోనే జరపాలని అందుకు తగిన ఏర్పాట్లను చేయిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావాలన్నారు. సక్రమంగా విధులకు హాజరు కాని వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కన్వీనర్ మహేంద్ర, సచివాలయాల మండల కన్వీనర్ శివన్న, వైస్ ఎంపిపి గాయత్రి హేమంత్, సర్పంచులు హనుమంతరాయప్ప, నటరాజు, శివన్న, ఎంపిటిసిలు సురేష్, నజీర్, సతీష్, మండలంలోని వైకాపా నాయకులు మంజునాథ్, లింగరాజు, షమీవుల్లా తదితరులు హాజరయ్యారు.

కెజిబివి ఆదర్శ పాఠశాలల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులతో డిఐజి టెలీ కాన్ఫరెన్స్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ చిత్తూరు, తిరుపతి జిల్లాల సిఐలు, ఆ పై స్థాయి పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ . ఈ నెల 11వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వ యంతో పని చేయాలన్నారు. రాజీ మార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాల వారికి తెలియజేసి ఎక్కువ కేసులను పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా దర్యాప్తు అధికారులు యుఐ కేసు ల తగ్గింపు నిమిత్తం సంబంధిత న్యాయమూర్తులతో సంప్రదించి పెండింగ్ కేసులను తగ్గించేలా కృషి చేయాలన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఘటనలకు తావుం డరాదన్నారు. రానున రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుకుగా పని చేయాలని, ముందస్తు సమాచారం సేకరణలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఈ టెలీకాన్ఫ రెన్స్‌లో చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు, ఆయా జిల్లా పోలీసు కార్యాలయాల నుంచి రెండు జిల్లాల పోలీసు అధికారులు ఆయా పోలీసు కార్యాల యాలు/పోలీస్‌స్టేషన్ల నుంచి పాల్గొన్నారు.

టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎటిపి రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్

మసీదుల అభివృద్ధికి రూ.II లక్షల విరాళం అందించిన ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం పాపంపేట పంచాయితీ విద్యారణ్యనగర్‌లో గల ఫాతిమా మసీదు,తారా మసీదు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన స్వంత నిధులు రూ.11 లక్షల విరాళంగా ప్రకరించి మసీదుల మత పెద్దలకు అందజేశారు.శుక్రవారం మసీదులకు వెళ్లి ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫాతిమా మసీదుకు రూ.5 లక్షలు, తారా మసీదుకు రూ6 లక్షలు విరాళమును అందించారు.ప్రభుత్వం నుంచి మసీదుల అభివృద్ధి కోసం సాయ అందే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే రాబోయే కాలంలో ఇదే విధంగా మసీదుల అభివృద్ధి కోసం నావంతు సహాయ సహకారాలు ఉం టాయని ముస్లిం సోదరులకు భరోసా ఇచ్చారు.అనంతరం ముస్లిం, మైనార్టీ సోదరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతాలు తెలియజేశారు.

మతపెద్దలకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే.

మాట నిలబెట్టుకున్న టీడీపీ యువ నేత ఉన్నం మారుతి చౌదరి

కళ్యాణదుర్గం టౌన్,
ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం కేంద్రంలో రాష్ట్ర మంత్రి ఉషాశ్రీచరణ్ తెలుగుదేశం పార్టీ నాయకులపై చేసిన సవాళ్లు స్వీకరించి నేడు చెప్పిన సమయానికి చెప్పిన టీ సర్కిల్‌కు మంత్రి అవినీతి అక్రమాలను ఆధారాలతో సహా వస్తే మంత్రి తన బండారం బయటపడుతుందని ఉన్నం మారుతిని టీ సిర్కల్‌లో అక్రమంగా అరెస్టు చేశారు. అంటే మంత్రి ఉషాశ్రీ చరణ్ తన తప్పును ఒప్పుకున్నట్లే ఇవే కాదు ఇంకాచాలా ప్రజల ముందుకు తిసుకురావడానికి ఉన్నం మారుతి చౌదరి సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఉధ్ఘాటించారు.

ఉన్నం మారుతి చౌదరిని అరెస్టు చేస్తున్న పోలీసులు దృశ్యాలు

వన్నూరుస్వామి దర్గాను దర్శించుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండల పరిధిలోని దర్గా హొన్నూరు గ్రామంలో వెలిసిన పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీశ్రీశ్రీ వన్నూరుస్వామి దర్గాను శుక్రవారం ప్రభుత్వ విప్ కాపు రామ చంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక చదివింపులు నిర్వహించారు. వన్నూరు స్వామి కృపకు పాత్రులైయ్యారు. అనంతరం గ్రామంలో శుభకార్యానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వది ంచినట్లు గ్రామ సర్పంచు శకుంతలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపిపి యు.పద్మ, వైస్ ఎంపిపిలు నాగరత్నమ్మ, కందేపల్లి రమేష్, జిల్లాస్టీరింగ్ కమిటీ మెంబర్ వన్నల్లి రామాంజినేయులు, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాషా, వైఎస్ఆర్‌సిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, మనోహర్‌శెట్టి, ఆనంద్‌రెడ్డి, డీలర్ యల్లప్ప, పోతిరెడ్డి, డీలర్ వన్నూరుస్వామి, దేవగిరి చర్మాన్, ఫోటోస్టూ డి యో బసవరాజు, జయరామిరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, బొమ్మనహాల్ నాయుడు, సూరి, నేమకల్లు ప్రెసిడెంట్ పరమే శ్వర, కణేకల్ టౌన్ ప్రెసిడెంట్ కేశవరెడ్డి, కణేకల్లు కోఆప్షన్ మెంబర్ చర్మాస్ తదిత రులు పాల్గొన్నారు.

నూతన వధువరులను దీవిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

సంక్షేమ ప్రదాత మన సీఎం వైఎస్ జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

ప్రభుత్వవిఫ్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కుందుర్పి మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన గృహ సార థులశిక్షణ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంపై గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంలో రోడ్లు నిర్మాణం కోసం రూ. 21. 60 కోట్లు మంజూరు

- సీయం జగన్‌కు ప్రభుత్వ విఫ్ కాపు కృతజ్ఞతలు

రాయదుర్గంటౌన్,ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

రాయదుర్గం పంచాయతీ రాజ్ శాఖ తరుపున జీవో నెం: 59 ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయడంతో రాయదర్గం పట్టణంలో రోడ్లు నిర్మాణం కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.21. 60 కోట్లు విడుదల చేయించడంతో ప్రభుత్వ విఫ్ కాపు రామచంద్రారెడ్డి సీయం జగన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వవిఫ్ కాపు రామచంద్రారెడ్డి

హజరత్ సయ్యద్ సాలార్ మసూద్ గాజీ ఉరుసు వాల్‌పోస్టర్లు విడుదల - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల,
ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

.శింగనమలమండల కేంద్రంలో వెలిసిన హజరత్ సయ్యద్ సాలార్ మ సూద్ గాజీ ఉరుసు ఉద్సవం ఈ సందర్భంగా శుక్ర వారం జిల్లా కేంద్రం లోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చేతులు మీదుగా దర్గా ముజావర్ ముల్లా అక్రమ్ రజాక్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ యువనాయకులు ఆలూరు ఎరిస్వామిరెడ్డి, ఆ పార్టీ నాయకులు డా.శివశంకర్‌రెడ్డి, బెస్త గోపాల్, ఫకృ ద్దీన్, కోఆప్షన్ మెంబర్ మస్తాన్ ఆలీబాషా తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గడ్డు ఇవ్వలేదు..పాలు రాలేదు - తూతూ మంత్రంగా అంగన్‌వాడి కేంద్రం తనిఖీ

భోజనం పరిశీలిస్తున్న దృశ్యం

రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

మండలంలోని వరదాయపల్లి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని రాష్ట్ర శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ సిరి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి శుక్రవారం తనిఖీ నిర్వహించారు. తనిఖీ సమయంలో పిల్లలకు వడ్డించిన అన్నం పప్పులో గడ్డు లేదు, పాలు ఈ నెల రాలేదని అంగన్‌వాడి కార్యకర్తలకు వారి దృష్టికి తీసుకొచ్చారు. పాత స్టాక్ ఎక్కువగా వున్న కారణంగా బియ్యం, బేడలు కూడా కొత్త స్టాక్ వద్దని చెప్పి పాతవే వాడుతున్నారు. అయితే స్పందించిన రాష్ట్ర శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ సిరి పాత స్టాకును వెనక్కు పంపి కొత్తవి తెప్పించుకోవాలని సూచించారు. స్టాకు నాణ్యతను పరిశీలించిన తరువాతనే వాటిని తీసుకోవాలని నాణ్యత లోపిస్తే బాధ్యత మీదేనన్నారు. గత నెల బేడలు పూర్తిగా చెడిపోయిన వాటిని సరఫరా చేశారని వాటిని పరిశీలించి వెనక్కు పంపామని అంగన్‌వాడి కార్యకర్తలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మండల లోచాలా గ్రామాల్లో అంగన్‌వాడి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో పెద్దపప్పూరులో సూపర్‌వైజర్ దస్తగిరమ్మ సొంత గ్రామమైన వరదాయపల్లిలో మాత్రమే తనిఖీలు నిర్వహించడం పలు అను మానాలకు తావిస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు వచ్చి కూడా తూ తూ మంత్రంగా తనిఖీలు నిర్వహించడం ఏమిటని మండల ప్రజలు చర్చిం చుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సజితబేగం, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి ఆకస్మిక తనిఖీ

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి అంగన్‌వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పిల్లలకు, గర్భవతులకు అందుతుందా లేదా అని అంగన్‌వాడి కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రాలను ఆమె తనిఖీ చేపట్టారు. అనం తం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని జూటూరు కాలనీలో అంగన్ వాడి కేంద్రాన్ని పరిశీలి ంచామని అంగన్ వాడి కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భవ తులు, చి న్నారు లకు అందచేస్తున్న పౌష్టికాహారంను పరిశీలించి అనంతరం చిన్నా రులతో కొద్దిసేపు ముచ్చటించారు. రికార్డులను తనిఖీ చేసి అందిస్తున్న ఆహా రలోటు పాట్లు వుంటే సమస్యను తెలియచేయాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి

దశాబ్దాల కల ఫలిస్తున్న వేళ

- కమీషనర్ పట్టుదలతో రైల్వేరోడ్డుకు మహర్దశ - 80 శాతం పూర్తయిన విస్తరణ పనులు

హిందూపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

అత్యంత రద్దీగా వున్న హిందూపురం పట్టణ రహదారుల్లో కీలకమైన రోడ్డుకు ఎట్టకేలకు మహర్దశ వస్తోంది. మున్సిపల్ కమీషనర్ కోదూరు వెంకటేశ్వరరావు పట్టుదలతో దశాబ్దాలుగా పెండింగ్‌లో వున్న రైల్వేరోడ్డు విస్తరణ పనులు చకచకా జరుగుతుండడంతో ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్ర స్థాయి వున్న హిందూపురంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, ఇతర ప్రాంతాల నుండి నిత్యం వివిధ పనుల కోసం ఇక్కడికి వచ్చే ప్రజల రాకపోకలతో ట్రాఫిక్ కిటకిటలాడుతుంటుంది. ప్రధాన రహదారులు సైతం కబ్జాకు గురికావడం, మరోవైపు పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరణ చేయ డంలో రాజకీయ ప్రయోజనాలకే నాయకులు గతంలో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. దీంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఎస్‌బిఐ ఎన్‌టిఆర్ సర్కిల్ నుండి నంది సర్కిల్ వరకు ఒక కిలోమీటర్ మేర వున్న 35 అడుగుల రోడ్డును మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా 80 అడుగులకు విస్తరించాలని గతంలో నిర్ణయి ంచారు. అయితే స్థానికుల విజ్ఞప్తుల మేర దానిని 70 అడుగులకు తగ్గించగా అహుడా ఆమోదం ఇచ్చింది. ఏడాది క్రితం పనులు ప్రారంభమై చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా 163 దుకాణాలు, ఇళ్లు వున్నట్లు ప్రైవేటు ఏజెన్సీ సర్వే నివేదిక ఇచ్చింది. సంబంధిత యజమానులతో పలు దఫాలు కమీషనర్ చర్చలు జరిపి వారిని ఒప్పించగలిగారు. ఇప్పటి వరకు 80 శాతం మంది తమ అంగీకారం పత్రాలను అధికారులకు అందచేశారు. కట్టడాల తొలగింపు కోసం 117 మందికి పరిహారాన్ని మున్సిపాలిటీ అందచేసింది. కాగా కోల్పోయిన స్థలాన్ని గుర్తించి దాని మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు అధికంగా ఇస్తూ టిడిఆర్ బాండ్లను జారీ చేశారు. 36 మంది విస్తరణ పనులను వ్యతిరేకిస్తూ తాము నష్టపోతామని కోర్టును ఆశ్రయించగా డ్యూ ప్రాసెస్ కింద చర్యలు తీసుకో వాలని న్యాయస్థానం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నిర్మాణాలను కూడా అవసరమైన మేర తొలగించి వారికి పరిహారం అందచేస్తామని కమీషనర్ వివరించారు. 15వ ఆర్థిక సంఘం కేంద్రం నిధులు 84.5 లక్షలు విడుదల కాగా ఈ పనుల కోసం ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు పొందారు. గత నెలలో డ్రైనేజి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

పట్టణాభివృద్ధికి సహకరించండి : కమీషనర్ : ఎంఎల్‌సి మహమ్మద్‌ఇక్బాల్, కౌన్సిల్ సహకారంతో రైల్వే రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేస్తామని కమీషనర్ ధీమా వ్యక్తం చేశారు. భవనాలు కోల్పోయే వారిలో అభ్యంతరం చెప్పిన వారు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంగీకరించని వారి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు రెవె న్యూ చట్టం ప్రకారం ల్యాండ్ అక్విజేషన్‌కు వెళతామన్నారు. అప్పుడు మిగిలిన వారికి వచ్చినట్లు టిడిఆర్ మొత్తం వీరికి ఇవ్వడం జరగదని హెచ్చరించారు. విశాలమైన రోడ్డు, ఫుట్‌పాత్, పార్కింగ్ సౌకర్యం, సెంట్రలైటింగ్, తదితర పట్టణ సుందరీకరణకు ప్రజలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

. రోడ్డు విస్తరణ జరుగుతున్న రైల్వే రోడ్డు

కమీషనర్ వెంకటేశ్వరరావు

సంక్షేమ పథకాలు అర్హులందరికి అందాలి

- గృహసారథులకు సూచించిన ఎంఎల్‌సి - గైర్హాజరైన మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు

హిందూపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత నెరవేర్చాలని ఎంఎల్‌సి మహమ్మద్‌ఇక్బాల్ సూచించారు. శుక్రవారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఉదయం, సాయంత్రం వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో 38 వార్డులకు చెందిన గృహసారథులు హాజరయ్యారు. ఎంఎల్‌సి మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి సలహాలు, సూచనలు తీసుకో వాలని మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదాన్ని ప్రజల్లో నాటుకుపోయేలా చేయాలన్నారు. అనంతరం గృహసారథులకు ఫీడ్‌బ్యాక్ పుస్తకాలు, కరపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు మద్దన జయప్ప, మారుతిరెడ్డి, రోషన్‌అలి, తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరు : గృహసారథుల సమావేశాలకు పట్టణంలోని అధికారపార్టీకి చెందిన వైస్‌చైర్మన్ బలరామిరెడ్డితో పాటు మెజార్టీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. గతంలో వార్డు కన్వీనర్ల నియామకం, ప్రస్తుతం గృహసారథులు ఏర్పాటులో తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని అసంతృప్తితో వారు గైర్హాజరైనట్లు తెలిసింది. ప్రతి విషయంలో కూడా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇప్పటికే అధిష్టానానికి ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. విభేదాలు పరిష్కరించేందుకు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో ఇప్పటికే చర్చిస్తున్నట్లు తెలిసింది.

పథకాల కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎంఎల్‌సి, తదితరులు

వైభవంగా శ్రీనివాస కళ్యాణం

హిందూపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీబాలాజీనగర్‌లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 19వవార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీవారి కళ్యాణం ఘనంగా జరిగింది. తిరుపతి నుండి వచ్చిన ప్రత్యేక అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేదమంత్రాల నడుమ మాంగళ్యధారణ జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ఈ సందర్భంగా ఆలయ మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సుబ్రమణ్యం, ప్రసాద్, ఆంజనేయులు, వెంకటేష్, రవి, మోహన్‌రాజ్, రత్నయ్య, రామకిష్టప్ప, పామిశెట్టి శేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి కళ్యాణం దృశ్యం

హాజరైన భక్తులు

దోచుకో.... దాచుకో అన్న చందంగా వైసీపీ పాలన

- వైసీపీ రాక్షస పాలనతో విసిగి పోయిన జనం - ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె

నల్లమాడ ఫిబ్రవరి 10 ప్రభాతవార్త,

వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని దోచుకో... దాచుకో అన్న చందంగా పాలన సాగుతోందని, వైకాపా పాలనకు రానున్న సార్వత్రిక ఎన్నికలో చరమగీతం పాడాల ని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపేపల్లి పంచాయితీలో చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రతి ఇంటికి వైకాపా వ్యతిరేక విధానాలతో కూడిన కరపత్రాలను పంచుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నిత్యవసరాల ధరల పెరుగుదల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని, జగన్‌మోహర్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని, దీంతో రాష్ట్రంలో సామాన్య ప్రజలు జీవన విధానం అస్థవ్యస్తంగా మారిందన్నారు. వైకాపా పాలన అంతం కావాంటే ప్రజల్లో చైతన్యం, తిరుగుబాటు రావాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో నామమాత్రంగా డబ్బులు విదిల్చి మద్యం, పన్నులు, నిత్యావసర సరుకులు దరలు పెంచడం ద్వారా ప్రజల నుంచి రెట్టింపు మొత్తం వసూలు చేస్తోందని, సంక్షేమ పథకాల ప్రచారానికి వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. టీడీపీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రాష్ట్రంలో వస్తున్న ప్రజాదారణ చూసి ఓర్వలేకనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని చీకటి జీఓలు తీసుకొచ్చి రాష్ట్రంలో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై దౌర్జన్యాలు, అక్రమాలు, భూదందాలు పెరిగిపోయి ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకకపోతే టీడీపీ చూస్తూ ఊరుకునేది లేదని, తీవ్ర పరిణామాలు తప్పవని పాలకులకు హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సాధికారక జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మైలే శంకర, సలాంఖాన్, చిట్టిబాల రాజారెడ్డి, మైలే రామచంద్ర, దాదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గుండ్ర శివారెడ్డి, బుట్టినాగభూషణం, అబ్బాస్‌ఖాన్, కులశేఖర్‌నాయుడు, బాబావలి, వెంకటరెడ్డి, బజంత్రి మహేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి గోడ పత్రికలను విడుదల చేస్తున్న పల్లె

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ముందుగా వారికి వైకాపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ సంక్షేమపథకాలు అందరికి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత వున్న ప్రతి లబ్దిదారునికి పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత వుండి లబ్ది పొందకుంటే అలాంటి వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందేవిధంగా చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్య ంగా పేదరికాన్ని దూరం చేసేందుకు జగనన్న కంకణం కట్టుకున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఎన్నో మేనిఫెస్టోలు పెట్టి ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన తీర్పు 2024 ఎన్నికల్లో ఇస్తారని తిరిగి ముఖ్యమంత్రి జగనన్నను ఎన్నుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఈశ ర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సూరినా